# రవణమ్మ మనవరాలు

చల్లగాలి రివ్వున వీచింది. గాలి విసురుకు కిటికీ రెక్కలు దబాలున గోడకు కొట్టుకున్నాయి.

ఒళ్ళంతా వణుకు పుడుతుంటే నిద్రలోనే దుప్పటిని గొంతుదాకా లాక్కుని ముడుచుకుని పడుకుంది రవణమ్మ.

అంతలోనే కల కంటోంది. తుంగభద్ర పుష్కరాల్లో సంకల్‌బాగ్ ఒడ్డున నదిలో మునకలేస్తోంది.

నడుముదాకా వచ్చిన నీళ్ళలో కాళ్ళు తేలిపోతున్నట్టై ఉలిక్కిపడి పక్కనున్న గుంజను ఆసరాగా పట్టుకుంది.

ఆ ఉలికిపాటుతో నిద్ర మేల్కొంది రవణమ్మ. తను గట్టిగా పట్టుకున్నది నదిలో పాతిన గుంజ కాదు, తను పడుకుని వున్న మంచం పట్టెనని గ్రహించింది. తనున్నది నదిలో కాకపోయినా తన నడుముదాకా నీళ్ళు ఎలా వచ్చాయో అర్థంకాక ఒక్క వుదుటున లేచి మంచం దిగింది.

వీధి తలుపులు బయటనుండి ఎవరో బలంగా తోసినట్టు తెరుచుకున్నాయి. బయట నుండి విసురుగా లోపలికి దూకుతున్నాయి నీళ్ళు.

ఇళ్ళంతా నీళ్ళతో నిండి పోతోంది. మోకాళ్ళపైకి వున్న నీళ్ళలో అడుగుతీసి అడుగు వేయలేకపోతోంది.

ఊరంతా కరెంటు పోయినట్టుంది. ఎటు తిరిగినా చీకటే కనబడుతోంది.

రవణమ్మ కాళ్ళు వణుకుతున్నాయి. ఈ పిల్ల ఎక్కడా? కొట్టుకుపోయిందా దేవుడా... ఈ ముసలాయన ఇంకా గుర్రు పెడుతున్నాడా? జవాబు దొరకని ప్రశ్నలు మనసును ముసురుకుంటే భయాందోళనలలో కొట్టుకుపోతూ రెండు చేతులు బారజాపి రెండడుగులు ముందుకేసింది. "ఇటెక్కడికే? ఇంట్లోకి పోతే మునిగి పోవడమే... బయటకు పోదాం పద..." లోపలినుండి వచ్చిన రవణమ్మ మొగుడు ఆవిడను ఢీకొట్టి క్రింద పడబోయి, నిలదొక్కుకుని ఆమె చేయి పట్టుకుంటూ అన్నాడు.

చీకటిలో ఆయన ముఖం కనబడకపోయినా ఆయన గొంతులోని భయం రవణమ్మకి కనబడింది.

ఇంతలో ఆ... ఆ... ఆ... అని కేకలు పెట్టుకుంటూ చీకటిలో తడుముకుంటూ వచ్చి రవణమ్మను వాటేసుకుంది పదేళ్ళపిల్ల.

ముగ్గురూ ఒకరినొకరు పట్టుకుని వీధి గుమ్మం దగ్గరకు వస్తుండగానే పక్కనున్న పశువుల కొట్టంలో నుండి బర్రెల అరుపులు వినిపించాయి.

రవణమ్మ గుండె గుభేలుమంది. ఇంత పెద్ద పొట్టతో ఈ రోజో రేపో ఈనేట్లు వుంది లక్ష్మి... ఈ రాత్రి గడుస్తుందా? 'దేవుడా నీవే దిక్కు' అనుకుంటూ మనసులోనే దండం పెట్టుకుందామె.

"ఒక్క నిముషముండయ్యా" అంటూ ఆ కటిక చీకటిలోనే తన మంచం పక్కన పైన ఎత్తుగా గోడకు వున్న పలక మీద దేవుని పటం ముందు వుంచిన హుండీ కోసం తడిమి ఆ పక్కడబ్బాలో ప్లాస్టిక్ కవరులో వున్న డబ్బును తీసుకుని రవికెలో దోపుకుని "ఇంట్లో ఇంకేమైనా డబ్బుందా?" అనడిగింది రవణమ్మ.

"యాడుంది? అప్పుచేసి తెచ్చిన దుడ్లంతా ఖర్చుపెట్టి బిడ్డ పెండ్లికని సరుకులు తెచ్చేసినాడు కదా" అన్నాడు క్రిష్ణయ్య. "బియ్యం, చింతపండు, పప్పు, గిన్నెలు అన్నీ నీళ్ళపాలేనా?" రవణమ్మ గుండె బాదుకుంది. "అయ్యో దేవుడా వాళ్ళు ముగ్గురూ ఎట్లున్నారో... ఆదోనిక్కాడ ఇట్లనే నీళ్లొచ్చివుంటాయా?" ఏడుపు గొంతుతో అందామె. "అన్నీ కొట్టుకు పోయినాంక పిల్ల పెళ్ళి ఎట్ల చేసేది?"

"ఏడిస్తే ఏంది లాభం... ముందు ఇంట్లో నుండి బయటపడితే బతికే మాట.." పెండ్లాం చేయి పట్టుకుని నీళ్ళలో కాళ్ళు జారకుండా నడుస్తూ బయటపడ్డాడు కృష్ణయ్య. రవణమ్మ చేయిపట్టుకుని ఎక్కెక్కి పడుతూ నడిచింది పాప. వాళ్ళు ముగ్గురూ బయటకు రావడం తడవుగా ఒక తలుపు ఊడిపడి నీళ్ళలో కొట్టుకుపోయింది.

కొట్టంలో బర్రెలు భయ విహ్వలంగా అరుస్తున్నాయి. తమను గుంజలకు కట్టిన పలుపు తాళ్ళని త్రెంచుకుని తప్పించుకోవాలని చుట్టు చుట్టూ అలగం తిరుగుతున్నాయి.

చుట్టు పక్కల ఇళ్ళలోని జనం బయటకు రావడంతో అరుపులు, కేకలు చుట్టుముట్టాయి. ఎత్తుగా వుండే ఇళ్ళవేపుకు పరుగు పెడుతున్నారు.

రవణమ్మ తూలి పడబోతే పట్టుకుని ఆపాడు కృష్ణయ్య. ఆడపిల్ల నోరిప్పకుండా రవణమ్మ భుజం పట్టుకుని నడుస్తోంది.

పిల్లకు పెండ్లి బాగా చేయాలని అప్పుచేసి అన్ని సరుకులు తెచ్చి ఇంటినిండా నింపిన కొడుకును తలచుకుంటే గుండె పగులుతోంది రవణమ్మకు. "పిల్లకు గుడ్డలు కొనాలని ఆదోని పోయినారు ముగ్గురు... ఎట్లున్నారో ఏమో.." గుడ్లనీళ్ళు కుక్కుకుంటోంది.

"ఆ బర్రెలు అన్యాయంగా చచ్చిపోతాయేమో! కట్టు విప్పి వస్తానయ్యా" అంటూ పిల్లను సాయం తీసుకుని కొట్టంలోకి పోయింది.

నీళ్ళు అంతకంతకు పైకి వస్తున్నాయి. తడుముకుంటూ పోయి పశువుల వీపు నిమిరి కట్టు విప్పింది రవణమ్మ.

సూదిగేదె నిలబడిన చోటనే కలయ తిరుగుతోంది. "రాండప్పో" దూరంగా ఎవరో టార్చిలైటు వేసి అరుస్తూ పరుగు పెడుతున్నారు. రవణమ్మ, కృష్ణయ్య, పాప ఆ గుడ్డి వెలుగు వెంట తామూ నడిచారు నీళ్ళలో, కాళ్ళు లాక్కుంటూ, ముందుకు పడబోతూ, నిలదొక్కుకుంటూ.

ఇక నడవలేక ఒక చోట ఎవరిదో ఇంటి గేటును పట్టుకుని ఎక్కి ప్రహారీ గోడ మీద సొమ్మసిల్లి కూర్చుండిపోయారు. ఆ ఇంట్లో వాళ్ళు అప్పటికే వెళ్ళిపోయినట్టున్నారు. చీకటి తప్ప మనుషులు కనబడడం లేదు. వాళ్ళు గోడమీద కూర్చున్నా పాదాలు దాటి పారుతున్న నీటి చప్పుడు వాళ్ళ గుండె చప్పుడుతో కలిసిపోతోంది. వాడలను, వీధులను ముంచేస్తూ నీళ్ళు పారుతుంటే చీకటిలో నాలుగైదు గంటలు చావుకీ, బ్రతుకుకీ మధ్యన చిక్కుకుని గడిపాక తెల్లవారింది. నీళ్ళు ఇంకా పైకి వచ్చి ఆరడుగుల గోడ అంచుదాకా వచ్చేశాయి.

గోడకి అటు పక్కన ఆన్చివున్న నిచ్చెన కనబడగానే కృష్ణయ్య ముందు పిల్లనీ, పెండ్లాన్నీ దాని మీదకు ఎక్కించి తను ఆఖర్న నిచ్చెన మెట్టెక్కాడు.

చలిగాలి ఈడ్చికొడుతుంటే తడిసిన గుడ్డలలోవున్న ఆ ముసలివాళ్ళు, పసిపాప గజగజ వణుకుతున్నారు. పాపను తన దగ్గరగా హత్తుకుంటోంది రవణమ్మ. అక్కడికి ఫర్లాంగు దూరంలో ఎత్తైన స్కూలు భవనం వుంది. కానీ అంతవరకు ఈ నీళ్ళలో పోవాలంటే ఈత వస్తేనే సాధ్యం. ఆ ముగ్గురిలో ఎవరికీ ఈత రాదు.

"నీటికి కటకటలాడే కర్నూలుకు వరద తాకిడి ఏమిటి, తమ రాత కాకపోతే... నీళ్ళలో మునిగి ఊపిరాడక, నీళ్ళు మింగి, పొట్ట ఉబ్బి చచ్చేరాత రాసేడా దేవుడు? నాయనా సత్యం ఎక్కడున్నావురా?" అని కొడుకుని పలవరిస్తూ ఏడుస్తున్నది రవణమ్మ. పాప ఆమె దుఃఖాన్ని చూడలేక తానూ వెక్కిళ్ళు పెడుతోంది.

"ఏడు కొండలసామీ! నువ్వే మాకు దిక్కు.... మా ముసలి ప్రాణాలు పోయినాగానీ ఈ బిడ్డను కాపాడు తండ్రీ!" అంతలోనే దేవునికి మొక్కుతోంది రవణమ్మ.

దూరంగా ఒక పడవ కదులుతున్నట్టు కనబడి ముగ్గురూ కేకలు పెడుతూ చేతులు ఊపారు. కానీ అప్పటికే అందులో చేరిన మనుషులు కనబడగానే తలబాదుకున్నాడు క్రిష్ణయ్య.

ఇంతలో వీళ్ళ కేకలు వినబడినట్టు ఒక పుట్టి ఇటువైపు తిరిగింది. "వెంకన్నా.. దయచూపు తండ్రీ" అనుకుంటూ చేతులు ఊపింది రవణమ్మ.

ఆ పుట్టిలో అప్పటికే ఇద్దరున్నారు. మరొక ఇద్దరికే చోటుంది. "చిన్న బిడ్డలే

నాయనా..” అని బ్రతిమాలింది రవణమ్మ. పుట్టి నడిపే మనిషి ముసలివాళ్ళను ఎగాదిగా చూశాడు.

“మనిషికి మూడువేలన్నా ఇయ్యాల చూడమ్మా... దుడ్లుండాయా?” నిచ్చెనమీద కూర్చుని ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని రాత్రి గడిపిన ముసలి ప్రాణాలు ఉసూరుమన్నాయి.

“ఇదో నాయనా ఈ కవరులో ఎంత ఉండాదో నాకు తెలీదు... ఉన్నదంతా అదే! తీసుకుని మమ్మిల్ని ఆటికి చేర్చు” అడుక్కుంది రవణమ్మ.

“ఏందమ్మోయ్! మేం సత్రం నడిపే సాములంగాము. డబ్బులిస్తేనే ఎక్కండ్రి. ఆడ ఇంగా శానామంది కాచుకొని కూచుండారు. మా పేనాల మీద ఆస ఇడిసిపెట్టి ఇట్టా వొచ్చినాము. మెళ్ళో నల్లపూసలుండాయి గదా... ఏవీ లేదంటవే...” పుట్టి నడిపే పాతికేళ్ళ పడుచు రక్తం వెటకారంగా పలికింది.

రవణమ్మ క్రిష్ణయ్య వైపు చూసింది. అతను తల ఊపాడు. రవణమ్మ మెడలోని నల్లపూసల దండతీసి వాడి చేతిలో వేసింది.

ఆ గొలుసును ఒక చేతిలోనుండి మరొక చేతిలోకి మార్చి బరువు చూసుకున్నాక “ఎక్కమ్మా... బేగెక్కాల” అని తొందర చేశాడు పుట్టి నడిపేవాడు.

ముందు క్రిష్ణయ్య, తరువాత రవణమ్మ జాగ్రత్తగా నిచ్చెన దిగి ఆ పిల్లాడి సాయంతో పుట్టిలోకి చేరారు. ఆఖరుగా పాప దిగింది.

తీరా పాప పుట్టిలోకి కాలు పెడుతుంటే అడ్డుకున్నాడు అతను. “నువ్విచ్చిన నల్లపూసల దండ మీ మొగుడు పెళ్ళాలను తీసికెళ్ళడానికే సరిపోతది. పిల్లకు ఏరే ఇవ్వాల” అంటూ.

“ఇక బతికినంత కాలం బతకబోము. మా ముసలి ప్రాణాల కోసం కాదయ్యా... ఆ బిడ్డకోసమే అంగలారుస్తున్నాం. ఇక నీ కియ్యడానికి నా దగ్గరేమీ లేదు...” నిస్సహాయంగా నిలబడిపోయిన పాపను చూడలేక కళ్ళు మూసుకుంటూ అంది రవణమ్మ.

“ఏందమ్మోవ్ మాటిమాటికీ ఏవీ లేదు అంటావు. నీ మనవరాలి మీద కంటే నీకు నీ చెవి కమ్మల మీదే ఆశ వున్నట్టుంది” వెటకారంగా అన్నాడా కుర్రాడు. రవణమ్మ చేతులు చెవి తమ్మెలను తడిమాయి.

నిచ్చెన మెట్టు మీద నిలబడి పోయిన పాప రెండు చేతులూ అడ్డంగా ఊపుతూ వద్దన్నట్టు తల తిప్పుతోంది. కాలు వెనక్కి తీసుకుంది నిచ్చెన పట్టుకుని.

“ఏంది పాపా! ఆ కమ్మలు నీ పెళ్ళికిస్తనన్నదా మీ యవ్వ? అట్లయితే నువ్వీడనే వుండిపో...” రవణమ్మ మొగుని వంక చూడలేదు. తట్టా, బుట్టా, చాప, తడికా అనక కనబడిన వస్తువునల్లా లాక్కొని పోతూ ఉగ్రంగా పరిగెత్తుతున్న నీళ్ళను చూస్తోంది. దూరంగా నీళ్ళలో ముందుకు పోతున్న వాళ్ళ అరుపులు, ఏడుపులు వింటోంది. ముసలి తల్లిని

మోసుకుపోతున్న కొడుకు, బిడ్డను భుజాలమీద కెక్కించుకుని నీటికెదురు నడుస్తున్న తల్లీ... సాయం కోసం కేకలు పెడుతున్న ఆడవాళ్ళూ... రవణమ్మ కళ్ళు మసకలు బారుతున్నాయి.

"మన లక్ష్మి కొట్టుకుపోతోందయ్యా.... పాపం ఈ పొద్దో రేపో దూడనేయాల్సిన బర్రె... నీళ్ళలో కొట్టుకుపోతోందయ్యా..." ఏడుపు గొంతుతో అంటూ బర్రెను పట్టుకోవడాని కన్నట్లు రెండు చేతులూ అటు జాపి అంది రవణమ్మ.

గుండె బండబారినట్టు అటే చూస్తున్నాడు క్రిష్ణయ్య. "నీకు మతిగానీ లేదుటమ్మా... ఆ పిల్లనెక్కిస్తావో మీ ఇద్దరూ దిగుతారో ఏదో ఒక మాట చెప్పు, మనుషులే పోతుంటే బర్రె కోసం ఏడుస్తాదీయమ్మ..." విసుక్కున్నాడు పుట్టి నడిపే ఆసామి.

"బేగీ ఆ బిడ్డను పుట్టిలోకి ఎక్కించమ్మా..." అంటూ తొందర చేశాడు అందులో వున్న మరో మనిషి.

దూరంగా గోడలమీద, మిద్దెలమీద గుంపులుగా చేరిన జనం గోలగా అరుస్తూ రమ్మంటూ చేతులు ఊపుతున్నారు.

క్రిష్ణయ్య పిల్లను చెయ్యిపట్టి లోపలికి లాగినాడు. పుట్టి ముందుకు కదిలింది. మొగుడి మనసు చదివిన రవణమ్మ నిట్టూర్చి రెండు చేతులతో రెండు చెవులకున్న కమ్మలు గట్టిగా పట్టుకుని లాగింది. కమ్మలతో బాటు జారిపోయిన తమ్మెలు తెగి చేతిలో పడ్డాయి. తీగెతో తమ్మెకు చుట్టిన కమ్మలవి. తీసేదానికి రావని రవణమ్మకెరికే.

"ఇదో అబ్బయ్యా... తీసుకో..." అంటూ తెగిన చెవి తమ్మెలతో బాటు కమ్మలు పడవ వాడి చేతిలో వేసింది.

ఎఱ్ఱరాళ్ళ కమ్మలు రక్తంతో తడిసి మరింత ఎఱ్ఱగా మెరుస్తున్నాయి. తెగి రక్తం కారుతున్న రవణమ్మ చెవులకేసి, రక్తసిక్తమైన కమ్మలవైపు వెఱ్ఱివాడిలా చూస్తున్న అతడి కళ్ళలో ఆ రక్తపు ఎరుపు తొంగి చూసింది.

"ఎంత పనిచేసినావమ్మా మనవరాలి కోసం. అయి తీటానికి రావని చెప్పబన్లే.." అంటున్న అతగాడి గొంతులో తప్పు తెలిసిన బాధ సుళ్ళు తిరిగింది.

అంతా చూస్తున్న పాప మళ్ళీ చేతులు అడ్డంగా తిప్పుతూ తల అడ్డంగా ఊపింది.

"మూగదానివా ఏం? ఆ సైగలేంది?" చేతులకంటిన నెత్తురు కడిగేసుకోలేని కోపంతో అరిచాడతను.

"అది మూగదే నాయనా! అది నా మనవరాలుకాదని చెబుతోంది.." తెగిన చెవి తమ్మెల నొప్పి గురించి పట్టనట్టు ఆ పిల్ల వీపు నిమిరింది రవణమ్మ.

"ఈపిల్ల మా పక్కింట్లో వుండే సాయిబుల పిల్ల. వాళ్ళ అమ్మి, అబ్బా మొక్కు తీర్చుకోటానికి కడప దర్గాకు పోయినారు. పిల్లను ఒక పూటకు మాతాన ఇడిసి పెట్టింద్రు.

మా ప్రాణాలు పోయినా మానె గానీ... ఈ బిడ్డను వాండ్లకు చేర్చాలగదా..." లో గొంతుతో అంది రవణమ్మ. కృష్ణయ్య పెండ్లాం కేసి అబ్బురంగా చూస్తున్నాడు.

నీళ్ళను తోసుకుంటూ పుట్టి ముందుకు సాగుతోంది. మిగిలిన వీధులను, సందులను వెదుక్కుంటూ నీళ్ళు జలజల ప్రవహిస్తూంటే రవణమ్మ కళ్ళనుండి రాలిన కన్నీళ్ళు ఆ నీళ్ళలో కలిసిపోయాయి.

దూరంగా వున్న కొడుకు, కోడలు, మనవరాలి క్షేమం తెలియక ఆమె గుండె వెలిబుచ్చిన వేదనో... తెరచివున్న కళ్ళలో నీళ్ళు కారుతుండగా నిస్సహాయంగా ప్రాణాలు వదిలిన సూడిగేదె జ్ఞాపకం తెచ్చిన బాధనో... రవణమ్మ కళ్ళలో నీళ్ళు ఊరుతూనే వున్నాయి. ఆమె చేతులు మూగపిల్ల వీపు నిమురుతూనే వున్నాయి.

- 'ఉగ్ర తుంగభద్ర' కథాసంకలనం జూన్ **2010**